ప్రజాశక్తి
సోమవారం 22 సెప్టెంబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



విదేశీ మోజులో ప్రధాని : కాంగ్రెస్

ప్రజాశక్తి - నెల్లూరు : ప్రధాని మోడికి ఉన్న విదేశీ మోజు వల్ల గత 11 సంవత్సరాలలో దేశ జ్ఞాన సంపద,నైపుణ్యమైన యువతను దేశ అభివృద్ధికి వాడకుండా, విదేశాలకు సేవలం దించేందుకు, వలసలకు తోడ్పడేటట్లు ప్రోత్సహించారని,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె సంజయ్ కుమార్ ఆరోపించారు. రూరల్ కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ మోడీ ప్రధాని అయిన వెంటనే ప్రణాళికా సంఘం లాంటి వ్యవస్థలను ఎత్తివేసారని, ప్రతిగా నీతి ఆయోగ్ లాంటి వ్యవస్థలను నిరుగార్చారని, దేశంలో ప్రజా సొమ్ము కోట్లది రూపాయలు ఐఐటి, ప్రముఖ మెడికల్ కాలేజీలు, రీసెర్చ్ సెంటర్లు కు ఖర్చుపెట్టి ,డిగ్రీ పట్టాలు పుచ్చుకొని వస్తున్న మేధో సంపద కలిగిన విద్యార్థులను దేశ అభివృద్ధికి వాడుకోకుండా ఇక్కడ ఉపాధి కల్పించకుండా బాధ్యతారాహితంగా విదేశాలకు వెళ్లేట్లు మాయమాటలతో ప్రోత్సహించడం బిజెపి అగ్ర నాయకులు కు మాత్రమే దక్కిందని, ప్రపంచంలో ఏ దేశ నాయకులు ఇలాంటి పని చేయరని ఆవేదన వెలిబుచ్చారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్‌నాయకులు

పేదల ఇంటికి నిర్లక్ష్యపు 'తుప్పు'

రాష్ట్ర ప్రభుత్వం పేదల గృహ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది... హౌసింగ్ పేరుతో కోట్లాది రూపాయల నిధులు ఉపయోగం లేకుండా పోతున్నాయి... ఒకప్పుడు పేదలకు నిధులు మంజూరుచేస్తే అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకునే పరిస్థితులుండేవి. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టింది.. టిడిపి ప్రభుత్వం ఎన్టీఆర్ హౌసింగ్ పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేసింది...వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో హంగామా చేసింది. ఏ ఒక్కటీ పేదలకు ఉపయోగ పడలేదనే విమర్శలున్నాయి.. ఒక ప్రభుత్వం నిర్ణయాన్ని మరో ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తోంది.. గత వైసిపి ప్రభుత్వంలో జగన్న ఇళ్ల నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి సిమెంట్, స్టీల్ కొనుగోలు చేశారు. ఆ మొత్తంలో సుమారు 14 వేల సిమెంట్ బస్తాలు గడ్డలు కట్టిపోయాయి. బయట పడేయడంతో సుమారు 1,323 టన్నుల స్టీల్ తుప్పుపట్టిపోతోంది. పేదల ఇళ్ల పేరుతో ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నా సొంతింటి కల మాత్రం కలగానే మిగిలిపోతోంది.

◆ప్రభుత్వం, హౌసింగ్ అధికారుల నిర్వాహకం
◆14 వేల సిమెంట్ బస్తాల్లో గడ్డలు
◆1,323 మెట్రిక్ టన్నుల స్టీల్ తుప్పు
◆వైసిపి, టిడిపి రెండూ రెండే..

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వాలు కూడు, గుడ్డ, గూడు పేరుతో ఓట్లు , సీట్లు కోసం పీట్లు వేస్తున్నారే ఉన్నాయి. పేదల ఆర్థిక ఇబ్బందులను అసరా చేసుకుని కొత్తకొత్త పథకాలు తీసుకొస్తున్నారు. మూడు దశాబ్దాల కిందట పేదల ఇళ్ల నిర్మాణం చేసుకుంటే ప్రభుత్వం నగదుసాయం చేసేది. అప్పులు చేసి, వడ్డీలకు తెచ్చి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేవారు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడం తీసుకునేవారు. ఇటీవల ప్రభుత్వ నూతన విధానాలు పేదల ఇళ్ల పూర్తికాకుండానే మిగిలిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు "ఇందిరమ్మ" కాలనీలు ఏర్పాటు చేశారు. ఇది పూర్తి స్థాయిలో విజయవంతంకాలేదు. 2006లో కొత్తూరు వద్ద సుమారు 5,600 ఇళ్ల నిర్మాణాన్ని అధునాతన పద్ధతిలో చేపట్టడానికి అప్పటి మంత్రి ఆనం రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. అప్పటి కాంగ్రెస్ నాయకుల అవినీతి కారణంగా ఇక్కడ నిర్మించిన పేదల ఇళ్లు కూలిపోయాయి. అప్పట్లో ఈ ప్రాజెక్ట్ కోసం రూ 98 కోట్లు ఖర్చుపెట్టారు. సగం నగదు కాంగ్రెస్ పార్టీ నేతల జేబుల్లోకి వెళ్లింది.. టిడిపి అధికారంలోకి వచ్చాక 2014-19 కాలంలో "ఎన్టీఆర్ హౌసింగ్" పేరుతో అపార్ట్‌మెంట్ తరహాలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు,సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, పట్టణాల్లో వేలాది ఇళ్ల నిర్మాణం చేశారు. 2019 ఫిబ్రవరిలో చంద్రబాబునాయుడు వెంకటేశ్వరపురం గృహ సముదాయాన్ని ప్రారంభించారు. ఇందుకోసం జిల్లా వ్యాపితంగా సుమారు రూ 1050 కోట్లు ఖర్చు చేశారు. 2019లో వైసిపి అధికారంలోకి రావడంతో ఈ ఇళ్లకు రంగుమార్చి పంపిణి చేయకుండా, పేదలకు చెల్లించిన నగదుకు లెక్కలు చెప్పకుండా చేశారు. ఐదేళ్ల కాలంలో ఇళ్లు మొత్తం శిథిలమైపోయాయి. 2020 నుంచి వైసిపి "జగనన్న కాలనీ" లు ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో 9 అంకణాలు, పట్టణ ప్రాంతాల్లో ఆరు అంకణాలు పంపిణీ చేసి గృహ నిర్మాణం చేపట్టారు. వేలాది ఇళ్ల ప్రారంభించగా అందులో 70 శాతం బెస్‌మట్టం కూడా పూర్తి చేయలేదు. ప్రభుత్వాలు పేదల ఇళ్ల పేరుతో వేలాది కోట్లు ఖర్చు పెడుతున్నా చిత్తశుద్ధి లేకపోవడంతో నిరుపేదలకు సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది.

గోదాముల వద్ద తుప్పుపట్టిపోతున్న స్టీల్

సిమెంట్ గడ్డలు... స్టీల్ తుప్పు..!

వైసిపి ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కోసం అనేక అవకతవకలు జరిగిన విమర్శలున్నాయి. 2024 ఎన్నికలకు ముందు పెద్ద ఎత్తున సిమెంట్ , స్టీల్ ని హౌసింగ్ అధికారులు కొనుగోలు చేశారు. ఈ ప్రభుత్వం జగనన్న కాలనీను పట్టించుకోకపోవడంతో జిల్లాలోని 52 హౌసింగ్ గోదాముల్లో సుమారు 32,093 సిమెంట్ బస్తాలు నిల్వలున్నాయి. 16 నెలలుగా ఉపయోగం చకపోవడంతో అందులో సుమారు 14,000 సిమెంట్ బస్తాలు గడ్డలు కట్టిపోయాయి. స్టీల్ 1323 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి, గోదాముల బయట పడేయడంతో వర్షానికి తడిచి తుప్పుపట్టిపోతున్నాయి. ఆత్మకూరులో 1070, బుచ్చిరెడ్డిపాళెంలో 1055, కావలిలో 5970, కోవూరులో 1210, నెల్లూరు అంబాపురంలో 2000, నెల్లూరు కొండ్లపూడిలో 2539, పొదలకూరులో 1340, ఉదయగిరి గండిపాళెం రోడ్డులో 1035 బస్తాల సిమెంట్ నిల్వలున్నాయి. ఇందులో అత్యధిక భాగం గడ్డలు కట్టాయి. నెల్లూరు నగరంలోని నిర్మిత కేంద్రంలో సుమారు 100 టన్నుల స్టీల్ తుప్పుపట్టిపోతోంది. హౌసింగ్ గోదాముల్లో సుమారు 60 శాతం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఉపయోగం లేని సిమెంట్, స్టీల్‌కు నెల నెల వేలాది రూపాయలు అద్దెలు చెల్లిస్తున్నారు. ఎస్‌.పేటలో 2, అల్లూరులో 2, ఆత్మకూరులో 4, బోగోలులో 2, దగదర్తిలో రెండు, జలదంకిలో 2, కావలిలో 3, నెల్లూరులో 4, వెంకటాచలంలో 2, గోదాముల్లో ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి కోట్లాది రూపాయల ప్రజా ధనం తుప్పుపట్టిపోతున్నా పట్టించుకునే పరిస్థితులు లేదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా హౌసింగ్‌లో తీసుకొస్తున్న విధానాలు కారణంగా పేదల ఇళ్లు ముందుకు సాగడం లేదు. పేదలు ఇళ్ల నిర్మాణం చేసుకోకపోగ అప్పులు పాలైపోతున్నారు. ప్రభుత్వం పేదలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గోదాముల్లో సిమెంట్ బ్యాగ్‌లు గడ్డలు కట్టిన దృశ్యం

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు : డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం , తిక్కన సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మహాకవి నవయుగ వైతాళికులు సంఘసంస్కర్త గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీలు ప్రారం భోత్సవానికి ముందుగా గురుజాడ అప్పారావు చిత్ర పటానికి డాక్టరు జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ కోశాధికారి శాఖమూరి భోగేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు అనంత రం నాయకులు మాట్లాడుతూ సంఘసంస్కర్త గురజాడ అప్పా రావు దేశమంటే మట్టి కాదు.. దేశమంటే మను షులే , చట్టపట్టల్ పట్టుకుని.. దేశస్థులంతా నడవ వలెనోయ్, అన్నదమ్ముల వలన జాతుల.. మతములన్నీ కలసి మే లగవలెనుఅని పేర్కొంటూ దేశ సమైక్యత గురించి అప్పటి రోజుల్లోనే వివరించిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. తిండిగలిగితే కండకలదు.. కండగల వాడెను మనసు అని, దేశ ప్రజలు బాగుండాలని పాడిపంటలు గురించి చెప్పారని గుర్తు చేశారు. ఆనాటి సామాజిక రుగ్మతల మీద కన్యాశుల్కం అలాగే బాల్య వివాహాల మీద పుత్తడి బొమ్మ పూర్ణమ్మ కావ్యాలు రచించి సామాజిక రుగ్మతల మీద పోరాటం నడిపిన గొప్ప మహాకవి అని కొనియాడారు. ప్రముఖ చిత్రకారుడు శ్రీనాథ్ హాజర్రై విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనంపై మెలకువలు చిత్రలేఖనం యొక్క విశిష్టత గురించి వివరించారు. అలాగే విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచితంగా విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం కన్వీనర్ మంగళ పుల్లయ్య నిర్వహణ కమిటీ కన్వీనర్ ఆర్ నగేష్ , యు.టి.ఎఫ్ , రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు నిర్వహణ కమిటీ సభ్యులు జీ.కామయ్య, మాదాల వెంకటకష్ణ, జయ రామిరెడ్డి ,నరసింహారెడ్డి విజయ శ్రీ , పి శైలజ ప్రముఖ జానపద నాట్యాచార్యులు పి. నారాయణమూర్తి పాల్గొన్నారు.

గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

హోంమంత్రికి సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు :కొండేపి నియోజకవర్గంలో జరుగుతున్న అభివద్ధి పనులను ప్రారంభించడానికి , ఒంగోలు ఎంఎల్ఎ దామచర్ల జనార్ధన్ రావు ఆధ్వర్యంలో వికలాంగులకు ఉచితంగా ట్రై సైకిల్ పంపిణీ చేయడానికి ముఖ్యఅతిథులుగా వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు నివాసంలో నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే మర్యాదపూర్వకంగా కలిశారు. మోషే ఆమెను సత్కరించారు. ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ , టంగుటూరు మండలం ఐ టి డి పి ప్రధాన కార్యదర్శి పొనుగోటి చక్రవర్తి , ఏసుపోగు యోహాను , చాట్ల సంతోష్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :తోటపల్లి గూడూరులోని మహిళా బ్యాంక్ ఆవరణలో ఆదివారం శ్రీసత్య పీడియాట్రిక్ ఆర్థోపెడిక్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పేదల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. ఉచిత వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో వచ్చిన వారికి పరీక్షలు జరిపి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. పురిటి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి. మణి మదుల, డాక్టర్ ఎం. శ్రావణ్ కుమార్ కన్సల్టెంట్ ఆర్థోపె డిక్ సర్జన్ తదితరులు రోగులకు ఉచిత వైద్య చికిత్స లు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ, టిడిపి అధ్యక్షులు కొణతం రఘుబాబు, ప్ర ధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాసులు, ముత్యాల చిట్టిబా బు, మహిళా బ్యాంక్ అధ్యక్షురాలు శీనమ్మ, మేనేజర్ సుగుణమ్మ, ఇంగిలాల పెంచలయ్య, సాగునీటి సంఘం డైరెక్టర్ టి నాగేశ్వరరావు ఉన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనం

తోటపల్లిగూడూరు :ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదివే ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండలంలోని వరిగొండ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయులు వై. శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు.ఆదివారం మాట్లాడారు. ప్ర స్తుతం 8 వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థు లు మా త్రమే అర్హులని శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి -గుడ్లూరు :గుడ్లూరులోని విద్యుత్ కేంద్రం పరిధిలో ప్రతిరోజు తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పగలు రాత్రి అన్న తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరారకు తరచుగా అంతరాయం కలుగుతోంది. సబ్‌స్టేషన్‌లో ఇన్సులేటర్లు వి పలమవుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంత రాయం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. వినియోగదారులకి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా ఆపకుండా చూడాలని వినియోగ దారులు కోరుతున్నారు.

పనిగంటల పెంపు దారుణం : సిఐటియు

ప్రజాశక్తి - ఉలవపాడు : రాష్ట్రంలో కార్మికులకు 8నుండి 13 గంటల వరకు పని గంటలు పెంచుతూ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తీర్మానం కార్మికులకు ద్రోహం చేయటమేనని సిఐటియుజిల్లా నాయకులు జివిబి కుమార్ విమర్శిం చారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదలచేశారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను,రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపిల సంయుక్త కూటమి ప్రభుత్వం యధాతథంగా అమలు చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. అనేక త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని ఒక్క కలం పోటుతో రద్దు చేశారన్నారు. తక్షణమే ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. లేదంటే కార్మికుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు.

గోదాములో అగ్నిప్రమాదం..
రూ. కోటి ఆస్తి నష్టం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణం పడమరమంగళ పాలెంలో అలవల కష్ణ అనే వ్యక్తికి చెందిన గూడె ఆదివారం అగ్నికి ఆహుతి అయింది. దాదాపు కోటి రూపాయల మేర నష్టం కలిగినట్లు అంచనా వేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో గోడౌన్ నుంచి దట్టమైన పొగలు రావడంతో ఆ చుట్టుపక్కల ఉన్నవారు గమనించి అగ్నిమాపణ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గోడౌన్ తలుపులు పగలగొట్టి చూడగా మంటలు వ్యాపించి గోడౌన్ లో ఉన్న వివిధ రకాల సరుకులు మంటలలో కాలిపోతూ కనిపించాయి. ఆ ప్రాంతంలో ఉన్న యువకులు గోడౌన్ లోని సరుకులు కొన్ని హడావుడిగా బయటకు తీసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గూడెం అగ్నికి ఆహుతి అయింది. అగ్నిమాపక దళం సిబ్బంది మంటలు ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నించిన అగ్నిమాపక ఇంజన్ తీసుకువచ్చిన నీరుచాలలేదు. మరోసారి నింపుకొని రావలసిన పరిస్థితి ఏర్పడింది. దట్టమైన పొగలు అలుముకోవడంతో పడమరమంగళ పాలెం లో నివసిస్తున్న ప్రజలు భయంతో వణికిపోయారు. గోడౌన్ లో దాదాపు కోటి రూపాయల సరుకులు ఉన్నట్లు సమాచారం. మంటల దాటికి దాదాపు 70నుండి 80 లక్షల రూపాయల సరుకు అగ్నికి బూడిద అయినట్లు తెలుస్తుంది.విద్యుత్ షార్ట్‌సర్క్యూటే కారణమని అనుమానిస్తున్నారు.

అక్రమ కేసులకు భయపడం..

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి :ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతొందని, భయపడే పరిస్థితి ఉండదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మాజీ చైర్మన్ వీరి చలపతి అక్రమ అరెస్టును ఖండిస్తూ, శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , మేరీగ మురళీధర్ , కోవూరు యువజన విభాగం అధ్యక్షులు నల్లపురెడ్డి రజత్ కుమార్ రెడ్డి , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని వీరి చలపతితో మాట్లాడారు. వీరి చలపతి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వానికి వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించడం నిత్యకత్యంగా మారిందన్నారు.నెల్లూరు జిల్లాలో టిడిపి నాయకులు కొత్త సంస్కతిని పరువళ్ల తొక్కిస్తున్నారన్నారు. ఇప్పటికే అనేక మంది వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపించారన్నారు. అక్రమ కేసులు పెట్టి మాజీ జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వీరి చలపతి గారిని అరెస్టు చెయ్యడం దారుణమన్నారు. జెడ్పిటిసిగా, అంచెలు అంచెలుగా రాజకీయంగా ఎదిగిన దళిత నాయకుడు వీరి చలపతి అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని, స్థానిక నాయకులను ప్రశ్నించడం జీర్ణించుకోలేక వీరి చలపతిపై 16 సెక్షన్లతో కేసు నమోదు చేశారన్నారు. 2023లో జరిగిన దాడికి సంబంధించి, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల తర్వాత వీరి చలపతిని ఇబ్బంది పెట్టాలని హత్యాయత్నంతో పాటు, మరో15 సెక్షన్లతో కేసు నమోదు చేశారుని గుర్తు చేశారు. నారావారి రెడ్ బుక్ రాజ్యాంగం తమను ప్రశ్నించే వారిని ఎంపిక చేసుకొని కేసులు పెట్టాలి, ఎటువంటి కేసులు పెట్టాలి, వారిని ఎన్ని రోజులు జైల్లో పెట్టి ఇబ్బందులు పెట్టాలి, అనుకూల మీడియాతో వారిపై ఏ విధంగా దుష్ప్రచారం చేయాలి అన్న నాలుగు మూలస్థంబాలపై నడుస్తుందన్నారు. పాత ఎస్పీ బాటలోనే, కొత్త ఎస్పీ గారు నడవడం బాధాకరమన్నారు. వీరి చలపతిని రాత్రి నుండి ఇబ్బందులు పెడుతుంటే వారి కుటుంబ సభ్యులు బోరు బోరుమంటున్నారన్నారు. రేపు మీ కుటుంబ సభ్యులు దీనికి పది రెట్లు బోరుమనే పరిస్థితులు ఏర్పడుతాయని గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు.

స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతోన్న కాకాణి

'దామచర్ల'కు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : మాజీ మంత్రి దివంగత దామచర్ల ఆంజనేయులు 18వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రకాశం జిలా, టంగుటూరు మండలం మర్లపాడులో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. దామచర్ల ఆంజనేయులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఇతర ప్రజా ప్రతినిధులు కలిసి నందమూరి తారక రామారావు, పరిటాల రవీంద్ర,దామచర్ల ఆంజనేయులు విగ్రహాలను ఆవిష్కరించారు. ప్రజా నాయకుడు దామచర్ల ఆంజనేయులు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు

కోడూరు బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు సముద్ర తీరం లో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. కొంత సమయం కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో సర దాగా గడిపేందు కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుం చి భారీ సంఖ్యలో ప్రజలు కోడూరు తీరానికి తరలి వ చ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల రాక పోక లు సాగాయి.ఎటువం టి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా తీరం వెంబడి ఎస్ఐ వీరేంద్ర బాబు ఆధ్వర్యంలో పోలీసు బం దోబస్తును నిర్వహించారు.అధిక సం ఖ్య లో తరలి వచ్చిన ప్రజలతో కోడూరు సముద్ర తీరంలో పండుగ వాతావరణం

కందుకూరు మార్కెట్ కమిటీ
చైర్మన్ నియామకంపై ప్రతిష్టంభన..!

○నాలుగున్నరేళ్లుగా ప్రత్యేకాధికారి పాలనలోనే..
○ఎస్‌సి మహిళకు రిజర్వు కావడంతో పోటీపడుతున్న ఆశావహులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి నియామకంపై ప్రతిష్టంభన నెలకొంది. ఆ పదవి ఎవరిని వరిస్తుందో.. ఎప్పటికీ నియమిస్తారు అని ఆశా వాహులు ఎదురుచూస్తున్నారు. కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవిని గత ప్రభుత్వ హయాంలోనే ఎస్‌సి మహిళకు రిజర్వ్ చేశారు. 2021 నుండి ఇప్పటివరకు ఆ పదవి భర్తీకాలేదు.2019 శాసనసభ ఎన్నికల్లో వైసిపి విజయం సాధించింది. కందుకూరులో మానుగుంట మహీధర్ రెడ్డి ఎంఎల్‌ఎగా విజయం సాధించారు. గత ప్రభుత్వ హయాంలో ఓసి మహిళకు అధ్యక్ష పదవిని రిజర్వు చేశారు. అప్పట్లో వైసిపిలో ముఖ్యుడుగా ఉన్న గణేషం గంగిరెడ్డి సతీమణి గణేష్ శిరీషకు అధ్యక్ష పదవిని ఇచ్చారు. అ పదవి కాలం వైసిపి ప్రభుత్వ హయాంలో ఏడాది అయినప్పటికీ ప్రభుత్వం దానిని పొడిగింపు ఇవ్వడంతో గణేషం శిరీషా రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఆమె ఓసి సామాజిక వర్గనికి చెందిన మహిళ. ఆ తర్వాత అధ్యక్ష పదవిని షెడ్యూల్ కులాల మహిళలకు రిజర్వు అయినప్పటికీ అప్పటి మహీధర్ రెడ్డి ఆ పదవికి ఎవరిని సిఫారసు చేయలేదు. అధికార పార్టీకి చెందిన శాసనసభ్యుడు లేదా పార్టీ ఇన్‌ఛార్జి సిఫారసుల మేరకే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులను నియమించడం బహిరంగ రహస్యమే. ఏ రాజకీయ సమస్య ఎదురయిందో కానీ అప్పట్లో మానుగుంట మహీధర్ రెడ్డి 2024 శాసనసభ ఎన్నికల వరకు మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవికి ఎవరిని సిఫారసు చేయలేదు. మహీధర్ రెడ్డి ఎంఎల్‌ఎగా ఉండగా దళిత సామాజిక వర్గానికి చెందిన అనేకమంది మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి కోసం పోటీపడ్డారు. 2024లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక పలువురు పార్టీ నాయకులు ఈ పదవిపై కన్నేశారు. బిసి, ఓసి వర్గాలకు చెందిన నాయకులు కొందరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి కోసం ఇప్పటి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు వద్ద పైరవీలు చేశారు. షెడ్యూల్ కులాల మహిళలకు రిజర్వు అయిన కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవిని ఓసి క్యాటగిరికి మార్చాలని నియోజకవర్గంలోని కొందరు నేతలు తీవ్రంగా ప్రయత్నించారు. ఎంఎల్‌ఎపై ఒత్తిడి తెచ్చారు. దానివల్లనే ఈ అధ్యక్ష పదవికి ఎంపిక పూర్తి కాలేదని ప్రచారం జరిగింది. ఆ ప్రచారానికి తెరతీస్తూ కొద్ది నెలల కిందట జిల్లా ఉన్నతాధికారులు నెల్లూరు జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవుల రిజర్వేషన్లు ప్రకటించారు. కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవిని షెడ్యూల్ కులాల మహిళలకు రిజర్వు చేసినట్లు ప్రకటన వెల్లడైయింది. దీంతో ఆ సామాజికవర్గానికి చెందిన పలువురు పోటీపడుతున్నారు. తెలుగుదేశం పార్టీలో కీలకంగా ఎంతో కాలంగా పనిచేస్తున్న కొండి కందుకూరు గ్రామానికి చెందిన రెబ్బవరపు మాల్యాద్రి తన సతీమణికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇవ్వాలని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కలిసి కోరారు. రెబ్బవరం మాల్యాద్రి తెలుగుదేశం పార్టీకి నమ్మకమైన నాయకుడిగా ఎంతో కాలంగా ఉన్నారు. టిడిపి అధికారంలో లేనప్పుడు కూడా తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నించాడనే ప్రచారం టిడిపి శ్రేణులతో ఉంది. మరోవైపు కందుకూరు మండలం కోవూరు గ్రామానికి చెందిన పలన్నాటి హనుమంతరావు అనే వ్యక్తి కూడా ఇటీవల ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు కలిసి తన సతీమణికి కందుకూరు వ్యవసాయం మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. కోవూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నాదెళ్ల రమణయ్య తదితరులతో ఎమ్మెల్యే ని కలిసిన హనుమంతరావు ఓ వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరరావును కలిసి అధ్యక్ష పదవిని కోరిన షెడ్యూల్ కులాల నాయకులకు ఈ పదవి మాలలకు ఇవ్వాలా.. మాదిగలకు ఇవ్వాలా అనే సందిగ్ధత ఉందని అధిష్టానం ఎవరికి ఇవ్వాలని చెబుతోందో వేచి చూడాలని ఎంఎల్‌ఎ చెబుతున్నారు.అధికార కూటమి ప్రభుత్వం నూతన కమిటీ నియామకం ఎప్పటికీ చేస్తుందో.. ఏ సామాజిక వర్గానికి కట్టబడెతుందో వేచి చూడాల్సి ఉంది.

ఇదే కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మహనీయుడు 'గురజాడ'

ప్రజాశక్తి-కందుకూరు

కన్యాశుల్కం వంటి దురాచారాన్ని రూపుమాపి మహిళల జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు గురజాడ వెంకట అప్పారావుఅని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జి.వి.మాల్యాద్రి తన అభిప్రాయం వ్యక్తంచేశారు. కందుకూరు సిద్ధార్థ స్కూలులో ఆదివాం జరిగిన గురజాడ జయంతి సభలో ఆయన ప్రసంగిస్తూ సమాజంలో వేళ్ళూనుకు పోయిన దురాచారాన్ని రూపుమాపిన మహనీయుడు గురజాడ అన్నారు. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు జె.నరసింహ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గురజాడ రాసిన దిద్దుబాటు కథ,పూర్ణమ్మ గేయం, దేశభక్తి గీతం తెలుగుభాషలో తలమానికమైనవి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి.వి.వి.కష్ణ కుమార్, మండల కార్యదర్శి వి.శరత్ బాబు,కరస్పాండెంట్ జి.రామారావు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు : సభ్యత్వ నమోదుపై రాష్ట్ర ఎపిఎన్ జి జి ఓస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వరు పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఓ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకష్ణ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఏ పి ఎన్ జి జి ఓస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి డిపార్ట్మెంట్లో ఉద్యోగులు అధికార్లు దగ్గర సభ్యత్వం నమోదు చేయించాలని ప్రతి ఉద్యోగికి మన రాష్ట్ర అధ్యక్షులు దిశా నిర్దేశం చేసిన విధంగా సంఘం గురించి వివరించాలన్నారు. తిరుపతి జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్ సురేష్ , అన్ని తాలూకాల అధ్యక్ష కార్యదర్శులు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య ,కోశాధికారి ప్రసాద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరుణమ్మ,కష్ణంరాజు ,సతీష్ బాబు ,సంయుక్త కార్యదర్శులు రాజేంద్ర ప్రసాద్ ,విజయకుమార్ ,కష్ణ కుమార్,సువర్ణ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వర్ణలత ,జిల్లా అధ్యక్షులు చిన్నమ్మ, తిరుపతి అడహాక్ సభ్యులు రఘు, లలిత్, చెంచరత్నం, జనార్ధనయ్య , నగర అధ్యక్ష కార్యదర్శులు రామకష్ణా రెడ్డి మార్కండేయులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎన్‌జిఒ నేతలు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :పేద ప్రజల పాలిట ఆపద్బాంధవుడిగా సిఎం నారా చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడానికి ముఖ్యమంత్రి సహాయనిధి నిజమైన వరంగా మారిందని తెలిపారు. ఆదివారం ఇక్కడి టిడిపి కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు మొత్తం 20.57 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వయంగా అందజేశారు.ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకు గొప్ప వరమని ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులకు కూడా చికిత్స పొందే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ప్రజల ఆరోగ్య భద్రతే మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ఈ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం చేస్తున్నారు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం ఉన్నారు.

23న రామాయపట్నంలో 'కాకాణి' పర్యటన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో నిర్మాణములో ఉన్న గ్రీన్ ఫీల్డ్ రామాయ పట్నం ఓడరేవు పనులను మాజీ మంత్రి వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి ఈనెల 23న పరిశీలిస్తారని ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు.పర్యటనను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అంబేద్కర్ పోరాటాలు మరువలేనివి..

ప్రజాశక్తి-కొడవలూరు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పోరాటాలు, మరువలేనివి ఆయన స్ఫూర్తిదాయంతోనే దళితులు స్వచ్ఛందంగా అన్ని విధాలుగా ముందుకు వెళుతున్నామంటే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన పుణ్యబలం అని జై భీమ్ నాయకులు అధ్యక్షులు పేర్కొన్నారు. సంఘం శరణం గచ్చామి, హైదరాబాద్ వారిచే అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొడవలూరు మండలం కొత్త వంగల్లు గ్రామంలో అంబేద్కర్ సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమం చేయటం నిర్వహించడంతో పరిసర ప్రాంతా నుండి దళిత నాయకులు హాజరవ్వడం జరిగింది వారికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంత సంతోషకరమైన విషయం అని కొనియాడారు. అనంతరం కొద్దిసేపు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పచ్చ మధుసూదన్, రమణయ్య, సర్పంచ్ ఆమవరపు సింధు, ఎంపిటిసి ప్రసాదు, దాసరి ప్రభుదానం, రత్నం, జగన్నాటి మహేష్, జ్యోతి సుమన్, కృపారావు, జైరాజ్, దళితులు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కావలి : ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం - నెల్లూరు జిల్లా శాఖ కార్యవర్గ ఎలక్షన్ కార్యక్రమం ఆదివారం నెల్లూరు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఆఫీసర్ భవనంలో ఎలక్షన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కావలి డివిజన్ పరిధిలోనీ జలదంకి మండలంలోని బ్రాహ్మణక్రాక-1 సచివాలయంలో పని చేస్తున్న గ్రామ సర్వేయర్ బీద లక్ష్మానందను జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లా నూతన కార్యవర్గం 2025 నుండి 2028 వరకు జిల్లా లో గ్రామ సర్వేయర్ల అభ్యున్నతికి పాటుపడుతూ, యూనియన్ సభ్యులకు అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా జిల్లా కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యక్షులు గాయం.శ్రీనివాసులు, సెక్రటరీగా షేక్.అసమతుల్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ నయాజ్, జాయింట్ సెక్రటరీగా సి.హెచ్. నాగ శివసాయినాథ్, కోశాధికారిగా ఎన్ ఫణి చైతన్య, మహిళ వింగ్ సెక్రటరీగా ఎమ్.వింధ్య, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.గంగాధరంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలక్షన్ నిర్వహణ అధికారిగా ఎస్.గోపాలకృష్ణ, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారిగా ఎ.మహేష్ నిర్వహించారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ చాంపియన్ కబడ్డీ, చెస్, థగ్ ఆఫ్ వార్ పోటీలు ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ చెస్, థగ్ ఆఫ్ వార్ పోటీలు ముగిశాయి. ఈ కబడ్డీ పోటీల్లో డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల చాంపియన్‌గా నిలిచింది. జెనెక్స్ కళాశాల నెల్లూరు రన్నర్‌గా నిలిచింది. చెస్ పోటీల్లో గవర్నమెంట్ డిగ్రీ కళాశాల సూళ్లూరుపేట చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్ గా రావూస్ కళాశాల నిలిచింది. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిమానుళ్ళ వెంకటేశ్వర్లు యూనివర్సిటీ పరిశీలకులు డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తూ కళాశాల ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వర్షం కారణంగా ఇబ్బందులు ఎదురైనా కళ్యాణ మండపంలో వ్యయ ప్రయాసలకోర్చి నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు మధుసూదన్ రెడ్డి, రమణయ్య, వెంగళరావు, సతీష్, రవీంద్ర, అంకమ్మ, సుప్రియ, తదితరులున్నారు.

గంధ మహోత్సవం విజయవంతం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్ అమెజాన్ దొరసానమ్మ వెలసి ఉన్న ఎఎస్‌పేటలో గంధ మహోత్సవాన్ని విజయవంతం చేసినందుకు దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌కు సిపిఎం కార్యదర్శి నిస్సార్ అహ్మద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 252వ గంధ మహోత్సవంలో రెండు వర్గాల మధ్య అనుసంధానం కలుపుకొని, ఒక వర్గమైన ఎస్‌జిఎస్ ఫయాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో గంధ మహోత్సవాన్ని ఎత్తే బాధ్యతను అప్పజెప్పి, ఆదేవిధంగా మరో వర్గం అయినా ఎస్‌జిఎస్ హఫీజ్ పాషా, జునేద్ పాషా వారిచే (దీపాలంకరణ), తహలీల్ పాతిహా, చదివింపుల కార్యక్రమాలను, ఎంతో అపర చాణిక్యత ప్రదర్శిస్తూ, రెండు వర్గాల మధ్య ఎలాంటి గొడవలు లేకుండా, మండలంలోని అందరి అధికారులను, పోలీసు సిబ్బందిని సమన్వయ పరచుకుంటూ, ఎంతో ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా, దర్గాకు విచ్చేసిన వేలాది మంది భక్తులకు అన్ని సదుపాయాలను కల్పించి, గంధ మహోత్సవాన్ని మునుపు నిర్వహించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

గిరిజన అధ్యక్షుడిగా రవికుమార్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని గుడిపాడు గ్రామంలోని ఎస్సి కాలనీ నందు, రాష్ట్ర దళిత గిరిజన సంఘాల జెఎసి అధ్యక్షులు సముద్రాల దావీదు ఆధ్వర్యంలో మండల గిరిజన అధ్యక్షుడుగా జి.రవి కుమార్‌ను మండల గిరిజన సభ్యుల మధ్య అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సి ఎస్టి గిరిజనులకు మీకు కలలు బలోపేతం కోసం, కలిసికట్టుగా పని చేయాలని ఉద్దేశంతో, జెఎసిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మైనారిటీ మహిళా అధ్యక్షురాలు షేక్ బార్ గిరిజన మహిళలకు ఎవరికి ఎక్కడ అన్యాయం జరిగినా, వారికి వెన్నుదన్నుగా జెఎసి తరుపున నిలుస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జి.రవికుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం నమ్మకం, ఉంచి తనకు గిరిజన మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి గిరిజన సోదరులకు, కుల పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర దళిత నాయకులు తుమ్మ మస్తాన్, మండల మైనారిటీ మహిళా అధ్యక్షురాలు షేక్ రజియా బేగం, ఆత్మకూరు మైనారిటీ మండల అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రంలో అన్నదానం

ప్రజాశక్తి-బిట్రగుంట : కావలి రుద్రకోట వాస్తవ్యులు వల్లెపు రమణయ్య కుమారుడు వల్లెపు ఏడుకొండలు మహేశ్వరి అమావాస్య సందర్భంగా పితృదేవతలకు గుర్తుగా బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కల్లెపల్లి సింహాద్రి రావు, ఉపాధ్యాయులు వల్లెపు క్రిష్ణమోహన్, ఆదరణ కేంద్రంలోని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దగదర్తి : మండలంలోని శ్రీరామపురం పంచాయతీ చెందిన ఉప్పలపాడు గ్రామానికి చెందిన మళ్లే వెంకటేశ్వర్లు (44) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ జంపాని కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బోగోలు మండలం జువ్వలదిన్నె కాపురం ఉంటూ, 19వ తేదీన రేషన్ సరుకులు తీసుకున్న నిమిత్తం ఉప్పలపాడు గ్రామానికి వచ్చి తమ ముత్తుపెంకు వెంకటరమణ ఇంట్లో ఉంటూ ఉండగా, ఆదివారం ఉదయం సుమారు 5గంటల ప్రాంతంలో బహిర్ భూమి నిమిత్తం ఉప్పలపాడు గ్రామానికి దక్షిణం వైపు ఉన్న గ్రామ శివారు ప్రాంతంలో రోడ్డుపై వెళ్తు ఉండగా గుర్తు తెలియని వాహనంతో ఢీకొనడం వల్ల బలమైన గాయాలు తగిలి కావడంతో అక్కడికక్కడే చనిపోయినాడు. పై విషయమును కేసు నమోదు చేసి, నైట్ హాల్ట్ ఉన్న ఆర్టీసి బస్సై అనుమానంతో సదరు బస్ డ్రైవర్‌ను విచారిస్తున్నామని తెలిపారు.

నిత్యావసరాలు పంపిణీ



ప్రజాశక్తి-కావలి : డి.ఆర్. విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక తమ కార్యాలయంలో 60 మంది నిరుపేద వయో వృద్ధులకు ఉచిత నిత్యావసర వస్తువులతో పాటు నగదును కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జవహర్ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లెక్చరర్ తోగరు గీతా రాణి విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. లెక్చరర్ గీతారాణి మాట్లాడుతూ విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డి.ఆర్. మహోన్నత మానవతావాది, నిరుపేదల పక్షపాతి, వారు సమాజానికి విద్యాసేవలతో పాటు అవసరమైన అన్ని సేవలు చేసి తమ జన్మను సార్థకం చేసుకున్నారని ప్రశంసించారు. తమ తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ సమాజానికి తమవంతు సేవ చేయుచున్న డి.ఆర్. పుత్రులు విశ్వోదయ రెక్టర్ దొడ్ల విజయ్ కుమార్ రెడ్డి, విట్స్ కాలేజ్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్ రెడ్డి అభినందనీయులని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల విజయకుమార్ రెడ్డి, సభ్యులు సతీష్, సల్మా రామకృష్ణ ప్రతాప్, రంగనాయకులు, రమణయ్య పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు అవసరం

జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

దోమలు పుట్టకుండా.. కుట్టకుండా.. నివారణ చర్యలు తీసుకుంటేనే సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియాలకు దూరంగా ఉండగలమని జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ పేర్కొన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కీటక జనిత వ్యాధుల భారిన పడేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాధుల భారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించాం. క్రమం తప్పకుండా ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, రక్తనమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. డెంగీ, మలేరియా వ్యాధికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పొరపాటున వ్యాధికి గురైతే నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ఆమె మాటల్లో ..

ప్రశ్న. మలేరియా వ్యాధికి గురికాకుండా ఉండేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఏదైనా కారణాలతో ఈ వ్యాధి బారిన పడితే తీసుకోవాల్సిన చికిత్స విధానం ఏమిటి ..?

జవాబు. మలేరియా వ్యాధి ప్లాస్మోడియం సంతతికి చెందిన (అనాఫిలిస్ దోమ) పరాన్నజీవుల ద్వారా మనిషికి సంక్రమిస్తుంది. ఆడ దోమ గుడ్లు పెట్టే సమయంలో మానవుని కుట్టిన సందర్భంలో మలేరియా వ్యాదికి కారణమైన పరాన్న జీవిని శరీరంలోకి వదులుతుంది. ఈ పరాన్న జీవి మానవుని శరీరంలోకి ప్రవేశించిన 8 నుంచి 30 రోజులల్లో జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు, విరోచనాలు, దగ్గు ప్రధానమైన లక్షణాలుగా కనిపిస్తాయి. ఒకొక్కసారి శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుంది. రక్తస్రావం, కామెర్లు, తీవ్రమైన అలసట, మూర్ఛ వంటివి తీవ్రమైన లక్షణాలుగా దర్శనమిస్తాయి. ఈ వ్యాధి నుంచి రక్షణ పొందాలంటే ఏకైక మార్గం దోమతెరలు వాడటం. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వాస్తవానికి దోమలు పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని నివారించడం సులువు. ఈ వ్యాధి బారిన పడిన వారు యాంటీ మలేరియల్ ఔషధాన్ని వైద్యుని సలహ సూచనల మేరకు తీసుకోవాలి.

ప్రశ్న. సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. జిల్లాలో డెంగీ వ్యాధితో ఎంత మంది చికిత్సలు తీసుకున్నారు. మరణాలు ఏమైనా సంభవించాయా..?

జవాబు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో మలేరియా, డెంగీ వ్యాధులను ఏ విధంగా అరికట్టాలి. ఈ వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ సదస్సులు ప్రధానంగా తీసుకొని నగర, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. బిసి వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్‌కు చెందిన ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాం. ఆశాలు, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు, సూపరవైజర్ల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 2023వ సంవత్సరంలో మలేరియా కేసులు 4 నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 3 కేసులు నమోదు అయ్యాయి. 2023లో డెంగీ కేసులు 116 నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 58 కేసులు నమోదయ్యాయి. ఎటువంటి మరణాలు నమోదు కాలేదు.

ప్రశ్న. డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఎన్ని సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఎంత మంది నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేశారు..?

జవాబు. డెంగీ కేసుల నిర్ధారణ పరీక్షలు నగరంలోని జిజిహెచ్, కావలి ఏరియా వైద్యశాల, కందుకూరు ప్రభుత్వ వైద్యశాల, ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుత్వం సెంటర్లను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్లలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతోపాటు వైద్యచికిత్సలు అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు 5275 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి డెంగీ నిర్ధారణ పరీక్షలు చేపట్టాం. వీరిలో కేవలం 68 మందికి మాత్రమే నిర్ధారణ అయింది. వీరికి చికిత్సలు అందజేసి పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాం. నగర శివారు ప్రాంతాల్లో ఈ డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. ఏయే ప్రాంతాల్లో అయితే ఈ కేసులు నమోదవుతున్నాయో ఆయా ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా డెంగీ వ్యాధి నిర్మూలనకు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల సమిష్టి సహకారంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నాం. డెంగీ పాజిటివ్ కేసు నమోదు అయిన ప్రాంతానికి చుట్టు పక్కల ఉన్న నివాసాలల్లో సుమారు 50 రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నాం.

ప్రశ్న. ఈ సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు.. దోమతెరలు ఏయే ప్రాంతాల్లో పంపిణీ చేశారు..?

జవాబు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వారంలో ఒక రోజు తప్పని సరిగా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటి సర్వే నిర్వహించడంతోపాటు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, స్ప్రే కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రూప్ సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. హైరిస్క్ కలిగిన ప్రాంతాలైన రాపూరు, దోమతెరల పంపిణీ చేశాం. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో మురుగు నీరు నిలువ ఉంటుందో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు దోమ గుడ్లు, ల్వారాలను నాశనం చేసేందుకు మత్స్యశాఖ అధికారుల సహాయంతో గంభూజియా చేపలను వదిలిపెట్టడం జరిగింది.

ప్రభుత్వ వైద్యశాల ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-ఉదయగిరి

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు నిర్లక్ష్యంతోనే తమ బిడ్డను కోల్పోయామని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం సీతారాంపురం మండలం బసినేనిపల్లి చెందిన మంజుల పురిటి నొప్పులతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఈ క్రమంలో రాత్రి 12 గంటల సమయంలో నొప్పులు ఎక్కువ కావడంతో నర్సులు డెలివరీ చేసిన తర్వాత డాక్టర్ వచ్చి బిడ్డను పరిశీలన చేశారని కుటుంబంలో ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికే ఆ బిడ్డకు హార్ట్ బీట్ తక్కువగా ఉండడంతో సిపిఆర్ చేసినప్పటికీ బిడ్డ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దాంతో డాక్టర్ నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృతి చెందారని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఆవేదనతో ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డి తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని బిడ్డ మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

రేపు రైతుసంఘం మహాసభ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రంలో 23వ తేదీ మంగళవారం రైతు సంఘం మండల 3వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మూలి వెంగయ్య తెలిపారు. మెట్ట ప్రాంతం విస్తారమైన భూములు ఉన్నప్పటికీ నీటి వసతి లేక రైతులు ప్రజలు వలసలు వెళు న్నారన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములు వారి పేరు మీద రికార్డు కావడంలేదన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారు. పై సమస్యల సాధన కొరకు 23సాయంత్రం 3గంటలకు జరుగు రైతు సంఘం మహా సభలకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికైన నూతన కమిటీ

ముస్లిం, మైనారిటీల సమస్యల పరిష్కారమే ఆవాజ్ లక్ష్యం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

స్థానిక మండలంలోని దామరమడుగు గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ 2వ మండల మహాసభను ఆదివారం మండల కార్యదర్శి షేక్ మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జెండాను సీనియర్ నాయకులు షేక్ జానీబాషా ఆవిష్కరించగా సభాధ్యక్షులుగా షేక్ జక్రియ వ్యవహరించారు. అనంతరం ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ 2002వ సంవత్సరం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ముస్లిం మైనారిటీల సమస్యలను పరిష్కరించేందుకు ఆవాజ్ సంస్థను ప్రారంభించామన్నారు. 3 సంవత్సరాలకు ఒకసారి రాష్ట్ర మహాసభలు గ్రామస్థాయిల నుండి జరుపుకొని కమిటీ ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. భద్రతా, లౌకికతత్వం, అభివృద్ధి అనే సిద్ధాంతాలతో ఆవాజ్ ముందుకు సాగుతుందన్నారు. దేశవ్యాప్తంగా మైనారిటీ హక్కుల మీద దాడులు జరుగుతున్నాయని దానిని నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కొనసాగేందుకు ఆవాజ్ లౌకిక శక్తులతో కలుపుకొని పోరాటాలు నిర్వహించేందుకు, ఆ హక్కులను కాపాడుకునేందుకు అవాజ్ మైనారిటీల సమీక్ష ఏర్పరచుకొని ప్రభుత్వాలు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుకునేందుకు గానూ పోరాటాలు చేసేందుకు ఈ మండల ఆవాజ్ సభలు జరుగుతున్నాయన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికొన్నారు. ఆవాజ్ మండల కార్యదర్శిగా బుచ్చిరెడ్డిపాలెం పట్టణానికి చెందిన ఎస్.కె మునీర్ అహ్మద్, అధ్యక్షులుగా దామరమడుగు గ్రామానికి చెందిన షేక్ జక్రియా, ఉపాధ్యక్షులుగా షేక్ జానీ భాషా, సహాయకులు ఎస్‌కె బాబు, ఎస్‌కె నజీర్, ఎస్‌కె పషా, ఎస్‌కె బాబు, కోశాధికారిగా ఎస్‌కె షబ్బీర్, ఎస్‌కె ఖాదర్బాషా, ఎస్‌కె షాకీర్, ఎస్.కె గయాజ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలో 15 రోజులలో రైతు సాగు చేసిన 10వేల ఎకరాలో వరి కోతలు మొదలవు తాయని కావున ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల కార్యదర్శి షేక్ అన్వర్ బాషా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పంట పండిస్తున్నారని, వారు పంట రాగానే అమ్మేసి అప్పులు తీర్చుకోవాలి అనే ఆశతో రైతులు బతుకుతున్నారని తెలిపారు. అందుకోసం పంట రాగానే వచ్చిన ధరకే అమ్మేస్తున్నారన్నారు. రైతు ధాన్యం రేటు పెరిగే వరకు నిల్వ చేసుకోవడానికి గో డౌన్‌లు ప్రభుత్వం నిర్మించాలన్నారు. ఉన్న గోడౌన్‌లను రైతుల కోసం వినియోగంలోకి తీసుకొని రావాలన్నారు. ప్రభుత్వాలు రైతుల కోసం ఇవేమీ చేయడం లేదన్నారు. రైతులు ధాన్యం నిల్వ చేసుకొనే వసతులు లేక అతి తక్కువ ధరకు అమ్మేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యల మీద రైతులు మాట్లాడాలన్నారు. వాటి కోసం పోరాడాలన్నారు. ఈ సమస్య గురించి ఏ మంత్రి, ఏ ఎంఎల్ఎ మాట్లాడడం లేదని, జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని, అందుకే రైతులు అందరూ ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. ధాన్యం మద్దతు ధర కోసం రైతుల పక్షాన నిలబడి పోరాడటానికి సిపిఎం సిద్ధంగా ఉందని తెలియజేశారు.

చైర్మన్ నియామకంపై హైకోర్టు స్టే

- కోవూరు వ్యవసాయ మార్కెట్‌లో రిజర్వేషన్లపై మళ్లీ వివాదం

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు నియోజకవర్గం రాజకీయంగా, వ్యవసాయపరంగా ఎప్పుడూ చర్చనీయాంశంగానే నిలుస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ మార్కెటింగ్ యార్డు చైర్మన్ పదవి స్థానిక రైతు సంఘాల్లో, నాయకత్వ స్థాయిలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంటుంది. ఈ పదవిలో ఉన్న వ్యక్తి రైతుల సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించడమే కాకుండా, స్థానిక రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపుతాడు.

ఎస్‌టి రిజర్వేషన్ నుంచి ఓసీ కేటగిరీకి మార్పు

ప్రభుత్వం ఆరంభంలో ఈ పదవిని ఎస్‌టి రిజర్వేషన్ కింద కేటాయించింది. ఈ నిర్ణయంతో స్థానిక ఎస్‌టి వర్గానికి చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అయితే, అనూహ్యంగా ప్రభుత్వం ఒక జిఒ ద్వారా ఈ పదవిని ఒసి కేటగిరీకి మార్చేసింది. ఈ నిర్ణయంతో ఎస్‌టి వర్గాల్లో తీవ్ర అసంతృప్తి మొదలైంది. "తమకు కేటాయించిన హక్కును ప్రభుత్వం కోల్పోనిచ్చింది" అంటూ పలువురు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

హైకోర్టులోకి ఎస్‌టి నాయకుల పిటిషన్లు

రిజర్వేషన్ నిబంధనలు ఉల్లంఘించబడినట్లు ఆరోపిస్తూ, పలువురు ఎస్‌టి నేతలు హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు, తాత్కాలికంగా జిఒ అమలుపై స్టే విధించింది. తదుపరి విచారణ వరకు కొత్తగా ఎటువంటి నియామకాలు చేపట్టకూడదని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, కోవూరు మార్కెటింగ్ యార్డు చైర్మన్ పదవి తాత్కాలికంగా నిలిచిపోయింది.

స్థానిక రాజకీయాల్లో కలకలం

ఈ పరిణామంతో స్థానిక రాజకీయాల్లో ఉద్రిక్తత తలెత్తింది. మార్కెటింగ్ యార్డు చైర్మన్ పదవి ఎవరికి దక్కనుంది.? రాబోయే ఎన్నికలపై దీనికి ఎలాంటి ప్రభావం ఉంటుంది.? అనే చర్చలు మొదలయ్యాయి. కోవూరులో ఎస్‌టి ఓటర్లు గణనీయంగా ఉన్న నేపథ్యంలో, వారి అసంతృప్తి రాజకీయ పార్టీలకు తలనొప్పిగా మారే అవకాశముంది.

రైతుల స్పందన : రైతులు మాత్రం భిన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. "తమకు రాజకీయ పోరాటాలు కావు. మా సమస్యలు తెలిసిన, పరిష్కరించగల నాయకులు అవసరమని, మార్కెటింగ్ యార్డు రైతుల కోసం ఉండాలి, రాజకీయాల కోసం కాదు" అని వారు అంటున్నారు.

తదుపరి దశలో ఏమవుతుంది??

ఇప్పుడు అంతా హైకోర్టు తుది తీర్పుపైనే ఆధారపడి ఉంది. ఒకవేళ కోర్టు ఎస్‌టి నాయకుల వాదనను సమర్థిస్తే, తిరిగి ఎస్‌టి రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. లేదంటే, ప్రభుత్వం జారీ చేసిన జీవో అమలులోకి వస్తుంది.

ఏదేమైనా, ఈ సంఘటన రిజర్వేషన్లపై చర్చను మళ్లీ వెలుగులోకి తీసుకొచ్చింది. కోవూరు ప్రజలు, రైతులు, నాయకులు అందరూ న్యాయం ఎవరికీ.. అని ఇప్పుడు ఒకే ప్రశ్న వేస్తున్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలని కోరుతున్నామని సిఐటియు నాయకులు వ్యాఖ్యానించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సిఐటియు 6వ మండల మహాసభలు సిఐటియు మండల అధ్యక్షులు గుండుబోయిన శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలలో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సురేష్ పాల్గొని మాట్లాడుతూ కరోనా సమయంలో భవన నిర్మాణ కార్మికులకు ఇసుక లేక కూలీలకు పనులు లేక లక్షలాది కుటుంబాలు వీధిన పడ్డాయని, కార్మికులకు రూ రూ.3వేలు ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినా స్పందించలేదన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డులో కొన్ని వేల కోట్లు ఉన్నాయని, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలను ఇతర ఖర్చులకు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుండి నిధులు దారి మళ్లించిందన్నారు. ఎటువంటి క్లెయిములు మంజూరు చేయలేదని తెలిపారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాల్లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను అమలు చేస్తూ ఇతర రాష్ట్రల్లో మాదిరి కార్మికులకు స్కీమ్ ప్రయోజనాలు వర్తింప జేయాలన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల చట్టాలను హరించి లేబర్ కోడ్ లను రద్దు చేశారని విమర్శించారు. గతంలో చంద్రబాబు రూ.450 కోట్లు, జగన్మోహన్ రెడ్డి రూ.250 కోట్లు దారి మళ్లించారన్నారు. మనం తెలుసుకునేంత వరకు మన కష్టాన్ని లూటీ చేస్తూనే ఉంటారని తెలియజేశారు. ప్రశ్నించడం మానేసినప్పుడు వారికి బానిసలుగా తయారవుతారన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం దానికి సంక్షేమ బోర్డు, సంక్షేమ బోర్డులో పనిచేసే కార్మిక వర్గానికి ఉపయోగ పడే రకరకాల ప్రయోజనాలు ఉంటాయనేది గుర్తుంచు కోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై భవన నిర్మాణ కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. మోడీ పాలనలో అన్నింటి ధరలు ఆకాశాన్ని అంటడంతో కార్మికలోకం భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు మండల కార్యదర్శి బత్తల రత్నయ్య, అధ్యక్షులు గుండుబోయిన శ్రీనివాసులు, భవన నిర్మాణ మండల కార్యదర్శి దండు జాన్సన్, ట్రెజరర్ టి లక్ష్మి, కె సుబ్బారావు, మిడ్డే మీల్స్ కార్యదర్శి డి.రాములమ్మ, సభ్యులు ఎం.కామాక్షమ్మ, బి.ఆదిలక్ష్మి, బి.భారతి, ఎస్ శేషయ్య, డి వెంకటరమణ, నానాజీ, అరుణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు జిల్లా నాయకులు హాజరత్త య్య, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మూలి వెంగయ్య, మండల కార్యదర్శి రహంతుల్లా, మహిళా సంఘం మండల నాయకురాలు మూలి ప్రమీల, సీనియర్ నాయకులు మహమ్మద్ గౌష్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు డ్రైవర్లు, దుకాణ షాపుల యజమానులు అన్నారు. ఆదివారం పట్టణంలోని సోమశిల సెంటర్ వద్ద ఉన్న , ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల స్టాండ్ వద్ద పలు రకాల మొక్కల నాటారు. ఈ సందర్భంగా ఈ స్టాండ్ వద్ద మొక్కలు లేకపోవడంతో స్టాండ్ వద్ద మొక్కలు నాటారు. ఎండాకాలం నిలబడడానికి నీడ లేకపోవడంతో ఈ ప్రాంతంలో చెట్లు నాటాలని డ్రైవర్లకి ఆలోచన వచ్చింది. అందుకు ఆదివారం మొక్కలు తెచ్చి ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. మొక్కలు పెరిగే వరకు వాటిని సంరక్షించే బాధ్యత కూడా బాధ్యత తీసుకున్నారు. కార్యక్రమంలో వాహనాల డ్రైవర్లు రహమతుల్లా, రమణయ్య, మున్ని, శేషారెడ్డి, హజరత్ రెడ్డి, లింగయ్య, అహ్మద్ భాషా, ప్రతాప్ తదితర ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వ్యాయామ పరికరాలు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

బచ్చు అమర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కృష్ణయ్య దంపతులు బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు వ్యాయామ జిమ్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ సాగర్ ఆదివారం జిమ్ పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు అరగంట సేపు వ్యాయామం చేయడం వల్ల సర్వ రోగాలు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బర్నాల్డ్, గౌరవ అధ్యక్షులు లోకసాని శ్రీనివాసులు, స్వర్ణన్ రాజ్, కుందుర్తి శ్రీనివాసులు, సెక్రటరీ పిల్లి జీవన్ కుమార్, మన్యం శ్రీనివాసులు శేఖర్ బాబు, సత్యం, అరుణ్‌కుమార్, రవి గన్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఆటంకం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ అభివృద్ధి చేసే క్రమంలో ముంబయి జాతీయ రహదారి రోడ్డుకు ఇరువైపులా గత వారం రోజులుగా కమిషనర్ బాలకృష్ణ ఆక్రమణలు తొలగిస్తున్నారు. ఇందులో భాగంలో ఎటువంటి అసంఘటనలకు తావివ్వకుండా తొలగించుకుపోయే క్రమంలో వ్యాపారులు, ఇంటి యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మున్సిపాలిటీ సిబ్బందికి సహకరిస్తున్నారు. బస్టాండ్ సెంటర్ వెంకటేశ్వర రైతు డిపో పక్కనున్న ఓ ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు కలసి తమ ఇంటి సమీపంలో ఎటువంటి ఆక్రమణలు ఉన్న తొలగించేది లేదని అందుకు తమకు కోర్టు ద్వారా అనుమతులు ఉన్నాయని వారు వాదనకు దిగారు. మున్సిపాలిటీ సిబ్బంది చేసేదేమీ లేక పోలీసులను ఆశ్రయించగా ఎస్ఐ సంతోష్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి కొంతమేర తొలగించారు. మిగిలిన భాగాన్ని తామే స్వచ్ఛందంగా తొలగించుకుంటామని, మరో రెండు రోజులు గడువు కావాలని కోరారు. ఆ ఇంటికి ఇరువైపులా డ్రెయిన్ కాలువ ఉన్న ఆ ఇంటి ముందు మాత్రం లేకపోవడం ఇంతవరకు ఏ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. గతంలో జాతీయ రహదారి నిర్మించే సమయంలో కూడా ఆ కుటుంబ సభ్యులు జాతీయ రహదారి సిబ్బందికి సహకరించక రోడ్డును ఆ ఇంటి దరిదాపుల్లోకి రానివ్వలేదు. పట్టణంలోని ప్రజలు, వ్యాపారస్తులు అందరికీ ఒక న్యాయం వారికి వేరే న్యాయమా అంటూ మున్సిపాలిటీ సిబ్బందిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ కుటుంబానికి రెండు రోజులు గడువు ఇస్తే కోర్టును ఆశ్రయించి మరి ఇంకేమైనా చేసే అవకాశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా అక్రమణల తొలగింపులు, పూడికతీత పనులు అనుకున్నట్లుగానే చేస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను పట్టణంలోని ప్రజలు మెచ్చుకుంటున్నారు.